"ఇచ్చేవాడి కంటే పుచ్చుకునే వాడే గొప్ప. నేను మా వాళ్ళకిచ్చిందాని వల్ల ఇప్పుడు నాకు ఒరిగేదేమీ లేదు. నా నించి దానం పుచ్చుకున్న అతని వల్లే నేను విజ్ఞతగా పుణ్యాన్ని సంపాదించుకునే అవకాశం, తద్వారా ఉత్తమ గతి పొందే అవకాశం నాకు కలిగాయి. నాకా గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతగా నేను అతన్ని చూడాలనుకుంటున్నాను." జవాబు చెప్పాడా ధనవంతుడు.

## 189. చెడు-మంచి

హైద్రాబాద్‌లోని ఇద్దరు బ్రాహ్మణులకి ఆస్తమా వ్యాధి వుంది. చేపమందు తింటే ఆ రోగం నయం అవుతుందని వాళ్ళిద్దరూ విన్నారు. అయితే ఇద్దరూ పూర్తిగా శాకాహారులు. ఒకడు చేపని మింగడం విషయంలో సంశయించాడు. ఇంకొకడు తను ఇంకా క్షీణిస్తే తన మీద ఆధారపడ్డ భార్యా పిల్లలు ఇబ్బందికి గురవుతారని వెళ్ళి ఆ చేపమందుని మింగాడు. దాంతో అతని ఆస్తమా పోయింది.

పాపభీతి గల మొదటివాడు చేప మందుని తినకపోవడంతో ఆ రోగం అధికం అయి ఓ తెల్లవారుఝామున ఊపిరాడక మరణించాడు. అతని భార్యా పిల్లలు అనాధలై అనేక కష్టాలకి గురయ్యారు.

**నీతి:** మంచి పని కోసం కొంత చెడు చేయాల్సి వస్తే అది పాపం కాదు. కాని చెడు కోసం చేసే ప్రతీ మంచి పనీ పాపమే అవుతుంది.

## 190. ప్రవచన లక్ష్యం

ఓ గురువుకి ఒంట్లో బాగాలేకపోవడంతో అతని శిష్యుడు ఆ రోజు ఆయన బదులుగా ప్రవచనం చెప్పాల్సి వచ్చింది. అతను రాసుకున్న ప్రవచనం కాగితాన్ని గురువుకి ఇచ్చి అడిగాడు.

"ఏమైనా మార్పులు, చేర్పులు సూచిస్తారా?"

దాన్ని గురువు అసాంతం చదివి చెప్పాడు.

"ఇదేం ప్రవచనం? దీంట్లో అసలు ఆధ్యాత్మికతే లేదు."

"రామాయణంలోని దండకారణ్యంలో రామ లక్ష్మణులు చూసిన వసంత కాల దృశ్య వర్ణన గురించి కదా నేను చెప్పేది. రామాయణంలో ఆధ్యాత్మికత లేదంటారా?" ప్రశ్నించాడు శిష్యుడు.

"భారత దేశంలోని ప్రతీ గ్రామం నించి, ప్రతీ ఊరు నించీ, ప్రతీ జిల్లా నించీ దేశ రాజధాని అయిన ఢిల్లీకి వెళ్ళే ఓ రోడ్డు తప్పని సరిగ్గా ఎలా ఉంటుందో, అలాగే ప్రతీ ప్రవచనం ఆధ్యాత్మికత వైపు తీసుకువెళ్ళే విధంగా ఉండాలి. మనిషి తన నడతని మార్చుకునేలా చేసేలా, తద్వారా మనసులోని మాలిన్యాలు కొన్నయినా పోయేలా ఏ ప్రవచనం అయినా ఉండాలి. సూక్ష్మంగా ఆధ్యాత్మికత అంటే, మనిషి తన దుష్ప్రవర్తనని తగ్గించుకుని, సత్ప్రవర్తనని పెంపొందించుకునేలా చేయడమే. అలా చెప్పకుండా ఊరికే రామాయణ, మహా భారత కథలు చెప్పడం, వినడం వల్ల ఏం ప్రయోజనం ఉండదు." వివరించాడు గురువు.

## 191. గురువు

ఓ గృహస్థు అనుకోకుండా తీర్థయాత్రలకి వెళ్ళాడు. సంవత్సరం తర్వాత తిరిగి ఇంటికి వచ్చాడు అతను. వెళ్ళిన మనిషి వేరు. తిరిగి వచ్చిన మనిషి వేరు అన్నంతగా అతను మారిపోయాడు. పూర్వం లేని వైరాగ్యం అతన్ని కమ్ముకోవడం అతని భార్య గమనించింది. పూర్వం తన మీద చూపించినంత అనురాగం అతనికి ఇప్పుడు లేదని గ్రహించింది.

ఓ రోజు అతను భోజనానికి కూర్చున్నాక భార్య వడ్డించింది. అతను ముందు పప్పు, తర్వాత కూర, ఆ తర్వాత పచ్చడి, చివరగా పులుసులని అన్నంలో కలుపుకుని రుచి చూసి వాటిని తినకుండా పక్కకి తోసేసాడు.